# ఆత్మార్పణం

చంద్రమ్మ నిజంగా అందకత్తె చందనపు బొమ్మ.

చిన్నప్పుడు ఆమెను అందరూ చంద్రి అనే పిలిచేవాళ్ళు. చిన్నప్పుడే చంద్రి అందమైన పిల్ల అనిపించుకొన్నది. నిజంగా చిదివి దీపం పెట్టవచ్చు ఆమె అందం. ఆ అందం, ఆ చందం ఆమెకే చెల్లు. నిండు పున్నమినాడు నింగినుంచి తొంగిచూచే చక్కని చంద్ర బింబమే చంద్రి ఆమె అందం క్రమంగా దుర్నిరీక్ష్యమై దివ్య తేజోపుంజంలా రూపొందింది. నిగ్రహపరులైన మహాశక్తిమంతులు కూడా ఆమె అందంపట్ల ఆకృష్టులు అయ్యేవారు. సామాన్యులు దీపంమీదకు వచ్చే మిడతలలా తపనపడి పోయేవారు. అకారణంగా పిచ్చిఆశలు పెంచుకొని వాంఛా పరిపీడితులు అయ్యేవారు. యువకులే కాదు- ఒకటి రెండు దశాబ్దాల జీవితానుభవం గడించిన వారే ఆమెపట్ల సమాకర్షితులు అయ్యేవారు. గుటకలు వేసేవారు. అది కేవలం వారి స్వభావం వ్యక్తం చెయ్యడమే అయ్యేది.

ఆమెలో ఒక ఆకర్షణ ఉన్నది.

ఆమె ఆకర్షణ అతి విలక్షణమైంది.

ఆమె తనూవిలాసం విలాస పురుషులను వరివరి విధాల రెచ్చగొట్టేదే అయినా ఆమె చూపులో ఒక మెత్తదనం ఉన్నది. సోయగంతో పాటు ఆ చూపు చిత్రమైంది. ఆ చూపులో ఆర్ద్రత ఉన్నది. అందులో కొన్ని మంటలను ఇట్టే చల్లార్చే చలువదనం ఉన్నది. ఆమె

చూపులో. పదునాలుగు సంవత్సరాలు నిండకుండానే ఆమెకు పాల పొంగులా వచ్చేసింది వయస్సు. ఆమె ఒడలంతా వింత సౌందర్యం ఝరులు కట్టింది. ఆ సౌందర్యం కొన్నిచోట్ల రాసులు పోసినట్లు అయ్యింది. శరీరంలో ఒంపులు, నిమ్నోన్నతాలు స్పష్టంగా కన్పించాయి. ఆమె కనుముక్కు తీరు, ఆమె దేహయష్టి అత్యంత ఆకర్షణీయమైనవి. కొత్తగా నీరు విడిచిన వంట బోదెలా నడిచింది ఆమె బాల్యం.

అంతలా కొట్టవచ్చినట్లు కన్పించే వయసు వచ్చినా, ఆమెకు అప్పట్లో సిగ్గు తెలియలేదు. చంద్రి చాలాకాలం వల్లె అయినా సరిగా వేసుకొనేది కాదు. ఆ గ్రామంలో ఆమె నిర్భయంగా కాలువలోనూ, చెరువులోనూ స్నానం చేసేది. తడి బట్టలతోనే ఇంటికి వచ్చేది. ఒక్కొక్కసారి అల్లా వస్తున్నప్పుడు దారిలో కొందరు వల్లె యువకులు సాభిప్రాయంగా, కొంటెగా, కొరుక్కు తినేద్దామన్నంత గాఢమైన కాంక్ష ప్రదర్శిస్తున్నట్లుగా తనవంక చూచినా ఒక్క విసరు లెక్క పెట్టేదికాదు చంద్రి. ఎవరైనా తనవంక చూచి నవ్వితే ఆమె తనూ నవ్వేది; ముత్యాల కోవలా ఉన్న పలువరుస బయటపడేలా. ఆ నవ్వు అందరినీ మురిపించేది. గిలిగింత పెట్టేది ఆ నవ్వు. ఎవరైనా వెక్కిరిస్తే ఆమె తనూ వెక్కిరించేది.

మళ్లీ ఆ విషయం మరుక్షణంలోనే మరచిపోయేది.

బాల్యం అంతా చంద్రికి ఆడింది ఆటగా పాడింది పాటగా సాగింది.

చంద్రమ్మ పల్లెలో పుట్టి పెరిగింది. సామాన్యపు రైతుయింట పుట్టినా ఆమె ఆ యింట ఒక్కతే పిల్లకావడంచేత జమీందారుల ఇంటపుట్టిన బిడ్డలా మహదర్జాగా, అతిగారాబంగా పెరిగింది. రామయ్యకు లేకలేక కలిగిన సంతానం ఆమె. అందువల్ల ఆమె అంటే గారాబం ఎక్కువ అయింది ఆ యింట్లో.

ఇంట్లో కాసేపయినా అల్లరి తగ్గుతుందని తల్లి పోరుపెట్టి పంపిస్తే బడికి వెళ్లింది చంద్రమ్మ. అలా వెళ్లిన చంద్రమ్మకు చదువు అంత చక్కగా అబ్బుతున్నందుకు అందరూ ఆశ్చర్యపడ్డారు. అందరికంటె ఎక్కువగా ఆమెతల్లి రత్తమ్మ ఎక్కువ ఆశ్చర్యపడ్డది. ఆనాడు ఎంతో సంతోషించింది.

చంద్రమ్మ ఊళ్లో ఉన్న ఉన్నత పాఠశాలలో చదువు ఆడుతూ పాడుతూ పూర్తిచేసింది. చీకూ చింతా లేకుండా గడిచిపోయింది ఆమెకు కాలం.

ఇదంతా ఒకనాటి స్థితి.

హఠాత్తుగా పరిస్థితి మారింది.

రామయ్య గుండెజబ్బు వచ్చి హఠాత్తుగా మరణించాడు. ఆయన భార్య రత్తమ్మ అప్పటికి ఉన్న పొలం పుట్రా అమ్మి దగ్గర ఉన్న బస్తీ చేరింది క్రొత్త ఊరే అయినా చేతిలో పుష్కలంగా డబ్బు ఉండడంచేత అన్ని అవసరాలు గడిచాయి. రత్తమ్మ బస్తీలో తేలిగ్గానే స్థిరపడింది. వచ్చిన రెండు మూడు సంవత్సరాలలో తెచ్చిన డబ్బు నగానికి పైగా హారతికర్పూరంలా హరించుకొని పోయినట్లు, కన్పించని ఖర్చులకు వ్యర్థం కాగా ఆ విషయం గమనించి రత్తమ్మ ఎవరు ఏమనుకొంటే ఏమని రెండు గేదెలు పెట్టుకొని పాల వ్యాపారం చెయ్యడానికి సిద్ధమైంది; నెమ్మదిగా పది ఇళ్ళల్లో వాడకం పెట్టింది. రెక్కలు ముక్కలయ్యేటట్లు పనిచేసింది గొడ్లదగ్గర. కాళ్ళ బలపము కట్టుకొని ఆమె వీధి వీధికీ, ఇంటింటికీ తిరిగింది. వాడుకగా పాలుపోసే ఇండ్లలో వెన్న నెయ్యి కూడా కొనడంవల్ల క్రమంగా వ్యాపారం వృద్ధి అయ్యింది. చంద్రమ్మకు చాలా కాలందాకా ఇదంతా పట్టనేలేదు. స్వగ్రామంలో పూర్వం తండ్రి ఉన్నప్పుడు ఎలా ఉండేదో ఇప్పుడూ

ఆలాగే ఉండటం గమనించి కూడా రత్తమ్మ ఏమీ అనలేదు. అవసరమైన పనులు చెప్పి చేయించకపోవడమే కాకుండా ఎప్పుడైనా ఎందుకో ఒక్కరవ్వ బుద్ధిపుట్టి ఆ పిల్ల సాయం చేయవస్తే "అఖర్లేదు. నువ్వు చెయ్యలేవీ పని" అని వారించేది. బయటకు వెళ్లనిచ్చేది కాదు ఆ లేడి పిల్లను ఎవరు పట్టుకొని ఇంట్లో కట్టేసుకొంటారో అని ఆమెకు భయం.

చంద్రి నిజంగానే లేడిపిల్ల.

అంత ఉత్సాహంగా ఉల్లాసంగా కన్పించేది.

*　　　　*　　　　*

రత్తమ్మ బస్తీకి చేరిన ఏడాదికి చాకిరీ తిరుగుడూ ఎక్కువ కావడంచేత జబ్బుపడ్డది. పది రోజుల తర్వాత సులభంగానే కోలుకొన్నది. కాని వీధిల్లోకి వెళ్లి అందరికీ పాలు పోసి వచ్చే ఓపిక చాలా రోజులదాకా రాలేదు. అప్పుడు చంద్రమ్మ ఆ పని తాను చేస్తానంది. రత్తమ్మ మొదట వద్దన్నది కాని చివరకు గత్యంతరం లేక ఒప్పుకొన్నది.

చంద్రమ్మ తల్లి వాడకం పెట్టిన ఇండ్లకు వెళ్ళి పాలుపోసి రావడం మొదలుపెట్టింది. మూడు నిమిషాలలో అన్ని ఇళ్లూ చుట్టబెట్టి వచ్చేది. వెళ్లిన మనిషి వెళ్లినట్టు వచ్చేది. క్రమంగా వాడకాలు పెరిగాయి. అందుకు నమ్మకంగా పాలు పొయ్యడం ఒక్కటే కాదు కారణం. ఆమె అందం కూడా కారణమే. ఆమె అందర్నీ ఆకర్షించింది. వ్యాపారంలో మెలకువలు తెలుసుకొన్నది. అందరితోనూ ఎంతో కలుపుగోలుగా మాట్లాడడం నేర్చుకొన్నది. మంచీ మర్యాదా అలవరచుకొన్నది. చంద్రమ్మ కొందరి ఇండ్లలో పాలు పొయ్యడానికి వెళ్ళి నిలబడే ఆ కాసేపటిలోనే ఎన్నో రకాల విషమ సమస్యలు ఎదుర్కోవలసి వచ్చేది. కొందరు డబ్బు ఎరచూపి చంద్రమ్మను లొంగదియ్యాలని

ప్రయత్నిస్తే, మరి కొందరు ఘనులు భయపెట్టి లోబరచుకోవాలని చూచారు. వారి ప్రయత్నాలన్నీ విఫలం అయ్యాయి. ధనప్రలోభం కలుగలేదు ఆమెకు. చిన్నప్పటినుంచీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవిస్తూ ఎవరైనా ఏదైనా అంటే మళ్లీ అంటూ, వెక్కిరిస్తే మళ్లీ వెక్కిరిస్తూ నిర్భయంగా కాలం గడిపిన పిల్ల కావడంచేత ఎవరి బెదిరింపులకూ భయపడలేదు. పైగా మళ్లీ బెదరించింది ఇంటికి వెళ్ళి మావతో చెబుతాననీ, బావతో చెప్పి బుద్ధిచెప్పిస్తాననీ హడల గొట్టింది. మళ్లీ అంత తెలివితేటలూ ప్రదర్శించి వాళ్ళతో తగూ పెరగకుండా వాడుకలు పోకుండా చూచుకొన్నది.

"వయసు వచ్చిన పిల్లవు ఒంటరిగా వెళుతున్నావ్ జాగ్రత్త! ఒకసారి కాలు జారితే తీసుకోలేరు మహా మహావాళ్ళే. ఇక నీలాంటి వాళ్లొకలెక్కా. జాగ్రత్త! అజ్ఞానంలో పడకు. పెళ్ళి అయ్యేదాకా మగవాడివంక కన్నెత్తి చూడవద్దు అనుభవిస్తున్న కష్టం చాలు. దీనికి తోడు లేనిపోని ఏ అప్రదిష్ట వచ్చినా అణగారి పోతాం. ఒంటరిగా ఆడది కనిపిస్తే చాలు. రకరకాల వన్నాగాలు పన్నుతారు. మగ దిక్కు లేని ఇంట్లో ఉన్న పిల్లవని తెలుసు కనుక మరీ ధైర్యంగా ఎత్తులు వేస్తారు. జాగ్రత్తమ్మా!" అంటూ రత్తమ్మ ఎన్నో రకాలుగా హితబోధ చేసేది. చంద్రమ్మ కా విషయం వంటపట్టింది. అందువల్లనే క్రొత్త క్రొత్త కోర్కెలతో వింత వింత ఆవేశాలతో హృదయం అకస్మాత్తుగా వరద వాగుల నీరుచేరిన సరోవరంలాగా పై అంచుల తాకుతూ అంత కంతకు పైపైకి పాలపొంగులా పొంగి పొరలుతున్నట్లుగా ఉప్పొంగి పోతున్నా, మనసు గుబ్బమై పెడదారులకు పట్టిందాలని ప్రయత్నం చేస్తున్నా, చంద్రమ్మ నిలవద్రొక్కుకొన్నది. ఎక్కడా ఎన్నడూ తప్పటడుగు వెయ్యలేదు.

ఆ రోజు కారోజు మరింత జాగ్రత్త నేర్చుకొన్నది.

*　　　　*　　　　*

చంద్రమ్మ ఆ రోజు రోజులాగానే వీరభద్రయ్యగారింటికి పాలు పొయ్యడానికి వెళ్ళింది. తలుపు దగ్గరగా వేసిఉంటె తలుపు తట్టి పాలు తెచ్చానండీ అని ఓ చిన్న కేక పెట్టింది. "ఒక్క రవ్వ నిలబడు" అంటో తలుపు తెరిచిన వ్యక్తి ఆమెవంక చూచి నివ్వెరపోయి అలా బొమ్మలా నిలబడి పొయ్యాడు. అతను చంద్రమ్మను నఖశిఖ పర్యంతం కన్ను ఆర్పకుండా చూస్తుంటే ఆమె సిగ్గుపడిపోయింది; తల మరోవైపుకు త్రిప్పుకొన్నది. అంతలో భయపడి వెనుతిరిగి వెళ్ళి పోబోయింది.

చంద్రమ్మ అలా వెళ్లిపోబోతూ ఉండగా వీరభద్రయ్యగారి భార్య సీతమ్మగారు గిన్నెతీసుకొని అక్కడకు వచ్చి ఆ దృశ్యం చూచి విషయం గ్రహించి "రా చంద్రీ రా- మరేం భయం లేదులే. ఇతను మా తమ్ముడు" అన్నది.

చంద్రమ్మ పాలుపోస్తూ ఒకసారి అప్రయత్నంగా అతనివంక చూచింది. అతను చిరునవ్వు నవ్వుతూ "నీ పేరేమిటి పిల్లా'' అని అడిగాడు. చంద్రమ్మ సమాధానం చెప్పలేదు. సీతమ్మగారు ముందుకు వచ్చి "ఇప్పుడు విన్నావుగా దానిపేరు చంద్రమ్మ. మేమంతా చంద్రీ అంటాం. సరే ఇంక రా'' అంటూ లోపలికి వెళ్ళింది.

చంద్రమ్మ ఛంగున ఒక్క గంతులో వెళ్ళింది. ఒక్కక్షణంలో అవతలకు వెళ్లింది. ఆ వీధిచివరకు వెళ్ళేదాకా అతను ఆమెను అల్లా చూస్తూ నిలబడి ఉండిపొయ్యాడు గుమ్మంలో. ఆ విషయం గమనించి చంద్రమ్మ మరింత తొందరగా వెళ్లింది. వెనక్కు తిరిగి అతనివంక మళ్లీ ఒకసారి చూడాలని ఎంతో అనిపించింది. అతనిలో ఏదో వింత

ఆకర్షణ కనిపించింది. అతని రూపం, అతని వింత చూపు, పల్కరించిన తీరు అన్నీ చంద్రమ్మను ఆకర్షించాయి.

అది ఒక క్రొత్త అనిపించింది చంద్రమ్మకు.

ఆ రోజు చంద్రమ్మకు ఏమీ తోచలేదు ఆ రాత్రి నిద్రపట్టలేదు.

ఆ రోజేకాదు. ఆ తర్వాత వారం పది రోజులదాకా చంద్రమ్మకు మనసు మనసులో లేదు. రత్తమ్మ ఆమె వాలకం గమనించి "ఇదేమిటే చంద్రీ అల్లా వుంటున్నావ్. ఏం ఒంట్లో బాగాలేదా? ఎవరన్నా ఏమన్నా అన్నారా?'' అంటూ లక్ష ప్రశ్నలు వేసింది. ఆమె దేనికీ సమాధానం చెప్పక పొయ్యేసరికి రత్తమ్మ ఆలోచనలో పడ్డది. రకరకాల కారణాలు ఊహించింది. ఏదో భయం కలిగి "జాగ్రత్తగా ఉండమ్మా పిచ్చి ఊహలు మాత్రం రానీయకు" అంటూ మాటిమాటికీ హితబోధ చేసి చంద్రిమ్మను విసిగించింది.

చంద్రమ్మకు ఎవరో తన హృదయ వీణను మీటి వెళ్లినట్లయ్యింది.

వీణానిస్వనముల వింత వింత రాగాలు ఇంకా వినవస్తూనే ఉన్నాయి ఆమెకు.

ఆమె ఆ రాగాలు విని రాగమతియై పరవశమై పోతూనే ఉన్నది.

పది రోజులు అలా గడిచాయి.

ఒకరోజు అతను ఎక్కడికో కారులో వెళుతూ కనిపించాడు. చంద్రిమ్మ అతన్ని వెంటనే గుర్తించింది అతను మాత్రం చూడలేదు. ఆతర్వాత చంద్రమ్మ అతన్ని అల్లా కారులో, జట్కాబండిలో ఎక్కడికో హడావిడిగా వెళుతుండగా చాలాసార్లు చూచింది. తడవ కొకరకంగా ఉన్న అతని వస్త్రధారణ చూచి ఆమె చకిత అయ్యింది. అతని రూపం ఆమెను పరిభావితం చేసింది. ఆ రూపం ఆమె హృదయంపై చెరగని ముద్రి వేసిం ది.

వీరభద్రయ్య గారింట్లో ముందు పోసి తర్వాత ఆ వీధిలో ఇతర ఇళ్లకు పోవచ్చునని చంద్రమ్మ ఓ రోజు కొంచెం పెందరాళే వెళ్లింది. తలుపు దగ్గరవేసివుంటే తోసి "సీతమ్మగారూ పాలు" అని కేక వేసింది. సమాధానం రాకపొయ్యేసరికి లోపల అడుగుపెట్టి హాలులో అతను కూర్చుని ఉండటము చూచి అక్కడే ఆగిపోయింది. "ఆ బల్లమీద గిన్నె ఉంది. తీసుకొని పాలు పోసి వెళ్లు" అన్నాడతను. చంద్రమ్మ లోపలకు వచ్చింది.

దగ్గరకు రానిచ్చి అతను చప్పున ఆమె చెయ్యి పట్టుకొన్నాడు. అటువంటి దేదైనా జరుగుతు దని అమె కలలోకూడా అనుకోలేదు. మరో క్షణంకూడా గడవకముందే రెండు చేతులతో ఒడుపుగా పట్టుకొని ఆమెను హఠాత్తుగా ముందుకులాగి బలవంతముగా, బలంగా గుండెకు హత్తుకొన్నాడు ఒక క్షణం ఆమె అతని బాహుబంధంలో బందీ అయింది. ఒక అర్ధలిప్త కాలం ఆమెకు ఒళ్లు తెలియలేదు. మరు లిప్తలో ఆమె అతని కౌగిలినుండి తప్పుకొన్నది. అతని చేయిపట్టు విదిలించుకొని అవతలకు పారిపోదామని ప్రయత్నించింది. అతను అమె ప్రయత్నం కనిపెట్టి చెయ్యి విడిచిపెట్టకుండా ఆమెవంక చూచి చిరునవ్వు నవ్వుతూ ముఖంలో ముఖంపెట్టి "నే నెవ్వరో తెలుసా?" అన్నాడు.

తెలియ దన్నట్లు తల ఆడించింది చంద్రమ్మ.

అతను ముందుకు వంగి అతి రహస్యంగా చెబుతున్నట్లు ఆమె చెవులో చెప్పాడు తన పేరు.

"బండ్ల కోటయ్య".

చంద్రమ్మ అ పేరు విని ఉలిక్కిపడ్డది. ఒక్కసారి భయపడ్డది. మనసులో ఏదో ఒక వెలుగు వెలిగినట్టయినది. అంతలో విద్యుత్తు

ఒకసారి శరీరమంతటా ప్రసరించినట్లయ్యింది. అదరిపడ్డది. బెదురుపుట్టి గజగజ వణికిపోయింది.

ఒకవంక సంభ్రమాశ్చర్యాలు, మరొకవంక విపరీతమైన భయాందోళనలు ఆమెను ఊపివేశాయి.

ఎంత గుంజుకున్నా, ఎంత గింజుకొన్నా అతను చెయ్యి విడిచి పెట్టలేదు. అంత బలంగా గట్టిగా పట్టుకొన్నా అతని చేతి స్పర్శ ఎంతో మృదువుగా ఉన్నట్లే అనిపించింది. ఎన్నడూ ఎరుగని సిగ్గు ముంచుకొని వచ్చింది. అంతలో ఏదో వింత ఆవేశం, ఆనందాతిరేకం, ఒడల జలదరింపు కలిగి ఆమె వివశురాలు అయ్యింది. కనులు ఎందుకో సగం మూతపడ్డాయి. ఆమె కళ్లు బలవంతంగా తెరుచుకొని ధైర్యంగా తలఎత్తి అతనివంక చూచింది. తన హృదయంలో కాదని ఎంత తప్పించుకొని తిరిగినా చోటు చేసుకొని, తిష్టవేసుకొన్న మనోహర రూపం ప్రత్యక్షంగా కట్టెదుట అలా కనిపించేసరికి ఆమె తెప్పరిల్లుకో లేకపోయింది.

పెద్ద ఎత్తైన పాలరాతి విగ్రహంలా చక్కని విగ్రహం. పచ్చని మేలిమి బంగారపు శరీరఛాయ. మెలికలు తిరిగిన కండలు. అందమైన కను ముక్కు తీరు. పెద్ద జుట్టు. అదొక చిత్రమైన రాజఠీవి. శోభనపు పెండ్లి కొడుకులా, జమీందారు బిడ్డలా, మంచి ఖరీదైన ఖద్దరు సిల్కు లాల్చీ, మంచి జరీ అంచు ఖద్దరు పంచ. భుజంపైగా క్రిందకు వ్రేలాడుతూ తెల్లని సిల్కు ఉత్తరీయం.

అతనిలో ఏదో వింత ఆకర్షణ కన్పించింది.

మరొకవంక ఆమెకు ఎన్నడూలేని భయం కలిగింది. అతను అంతసేపు కన్నార్పకుండా తనపైపే చూడడం గమనించింది. అంతలో తల్లి హితబోధ జ్ఞాపకం వచ్చింది. వెంటనే "చెయ్యి విడిచి

పెట్టండి. మా అమ్మ ఊరుకోదు" అన్నది. అతను ఆమె పరిస్థితి అర్థం చేసుకున్నాడు. నెమ్మదిగా, మృదువుగా "నువ్వు భయపడుతున్నావా? ఏం భయంలేదు. పద మీ యింటికి వెళదాం. మీ అమ్మను అడిగి మనం పెళ్ళి చేసుకొందాం" అన్నాడు.

అల్లా అని అతడు ఠీవిగా నడిచి బయటకు వెళ్లాడు.

తప్పనిసరియైనట్లు చంద్రమ్మ అతన్ని అనుసరించింది. చంద్రమ్మే కాదు- ఆమె తల్లి రత్తమ్మ కూడా అతన్ని చూచి భయపడిపోయింది. మరొకవంక సంబరపడి పోయింది. అతను పెళ్లాడుతానంటే మొదట ఆమె ఆనందానికి అవధి లేకుండా పోయింది. కొంతసేపు తర్వాత వెనకా ముందూ ఆలోచించింది. వారూ వీరూ చెప్పుకొనే మాటలు జ్ఞాపకం వచ్చిన మీదట కొన్ని ఆటంకాలు కన్పించాయి. కాని ఆమె అతని మాట కాదనలేక పోయింది. అతనిని ఎదురాడే ధైర్యం ఆమెకు లేకపోయింది. అటువంటి ధైర్యం ఆమెకే కాదు- ఆ గ్రామంలో, ఆ చుట్టుపట్ల గ్రామాలలో కాదు- ఆ తాలూకాలో కాదు- ఆ జిల్లా మొత్తంమీద ఎవరికీ లేదు. మామూలు ప్రజలకే కాదు- పెద్ద పోలీసు అధికారులకే లేదు. అందుకు తగిన కారణాలు లేకపోలేదు.

అతను గొప్ప స్థితిమంతుడు. ముప్పై ఎకరాల పొలం ఉన్నది. రెండు మామిడి తోటలున్నాయి. ఊళ్లో పెద్ద బ్రహ్మాండమైన భవనం ఉన్నది. ఇంట్లో కావలసినంత వెండి, బంగారం ఉన్నది. ఇంట్లో జమీందారీఫాయాలో, ఎక్కడ చూచినా సోఫాలూ, కుర్చీలూ, పెద్ద బీరువాలూ, నేలమీద తివాచీలు. స్థిరాస్తికాక అతనిదగ్గర డబ్బు చాలా ఉన్నదని అందరికీ తెలుసు. ఆ ఆస్తిఅంతా, ఆ భాగ్యమంతా అతను స్వయంగా సంపాదించిందే. అతను బయట చదువుకొన్నది చాలా తక్కువే. కాని స్వయం కృషివల్ల అతను విద్యావంతుడయ్యాడు.

లోకంలో బాగా తిరగడంచేత అనేక మందితో అనేక వ్యవహారాలలో జోక్యం పెట్టుకోవడంచేత గొప్ప లౌక్యం అబ్బింది. అతనికి మంచి సమయస్ఫూర్తి ఉన్నది. కొన్ని సమయాలలో పెద్దలముందు చాలా చక్కగా మాటాడగలడు. ఒక్కొక్కప్పుడు చాలా చమత్కార సంభాషణ చెయ్యగలడు. ఏ పని అయినా చురుగ్గా చేసెయ్యగలడు. అవసరమైనప్పుడు పది మందిని కూడగట్టుకొని రాగలడు. అతనికి భేదనోపాయాలు కూడా బాగా తెలుసు. డబ్బు ఎంత శీఘ్రంగా, ఎంత సులభంగా సంపాదించాడో అంత శీఘ్రంగా, అంత సులభంగా రాజకీయాలలో పైకివచ్చాడు. అబ్కారీ కంట్రాక్టరుగా ఉండి రెండు సంవత్సరాలలో విపరీతంగా సంపాదించిన డబ్బుతో పెద్ద భవంతి కొనగా మిగిలినది తన వలుకుబడి పెంచుకోవడం కోసం వెదజల్లాడు. రాజకీయాలలోకి అడుగుపెట్టిన కొద్దికాలానికే అతనికి సిద్ధాంతాలపట్ల విశ్వాసం కుదిరి కల్లు పాకలలోనూ, సారాదుకాణాలలోనూ కల్లు సారాయి, మాంసాదుల అమ్మకం మాన్పించి అక్కడ పట్టుపట్టి చరఖా సంఘాలు స్థాపించి ఖద్దరు ప్రచారానికి పూనుకొన్నాడు. మనసు కుదిరితే అతను ఏ పని అయినా చెయ్యగలడనీ, అవసరమనుకుంటే సర్వస్వం త్యాగం చెయ్యగలడనీ అందరూ అనుకొన్నారు.

ఒకసారి అతను సత్యాగ్రహంచేసి జైలుకు వెళ్లాడు మరోసారి ఉద్యమం ముమ్మరంగా ఉన్న రోజుల్లో తను ప్రత్యక్షంగా అందులో పాల్గొనడం ఇష్టంలేక జైళ్ళకు వెళ్లిన కార్యకర్తల కుటుంబాలన్నింటికీ ఎంతో సహాయం చేస్తూ సంస్థను కనిపెట్టుకొని ఉంటూ బయట ఉండిపోయాడు. సంస్థ తాలూకు పాతకాపు అని తెలిసి పోలీసులు అతన్ని అరెస్టు చెయ్యవస్తే అతనికి పట్టరాని కోపం వచ్చేసింది.

ముమ్మరంగా ముంచుకొని వచ్చే అధికాధిక ఆవేశాలను దుస్సహతరమైన ఆగ్రహాన్ని ఇట్టే అదుపులోపెట్టే సామర్థ్యము

లేదతనికి. అరణ్యాలకు అరణ్యాలను సమూలంగా పెకిలించివేస్తూ, ఊళ్లకు ఊళ్లనే తుడిచిపెట్టేస్తూ మహోధృతంగా పొంగివచ్చే గోదావరినే అవలీలగా, అలవోకగా తనలో లీనం చేసుకునే సాగరంలా కొందరి హృదయాలు గంభీరమైనవి; విశాలమైనవి. అతను అటువంటి గంభీర మైన వ్యక్తి కాదు. పైగా క్షణకోపి. అగ్రహానుగ్రహాలు ఒక్క రవ్వ కూడా అదుపులో పెట్టుకోలేడతడు. తన్ను అరెస్టు చెయ్యవచ్చిన పోలీసు అధికారులను చూచి నరసింహావతారం దాల్చాడు. హుంకరించి వారిని కొట్టబోయి, భయపెట్టి పారిపొయ్యాడు అలా వెళ్లి ఎక్కడో దాక్కొని నెల రోజుల తర్వాత ఊళ్లోకి వచ్చి స్వేచ్ఛగా తిరిగాడు. అతని దగ్గరకు రావడానికి ఎవరికీ ధైర్యం లేకపోయింది. స్థానిక అధికారులు అతను రహస్య స్థావరంలో ఉన్నాడనీ, కనిపించడం లేదనీ పైకి వ్రాసుకున్నారు.

అతను వ్యాపారం ప్రారంభించాడు అతను ఏ వ్యాపారం చేసినా కలిసివచ్చేది అతను మట్టి త్రవ్వించి పోస్తే బంగారపు గనులు బయటపడేవి. కాకిరాయి ఎగుమతి వ్యాపారంలో ఏడాది తిరక్కముందే లక్షరూపాయలు సంపాదించాడు. పోలీసు అధికారులు తనవంకకు రాకుండా ఉండేందుకు ఎంత కావాలంటే అంత "కానుక"గా ఇచ్చాడు. బీదవాణ్ణి అనీ అతని దగ్గరకు వస్తే లేదు అని, అతను ఎన్నడూ అనలేదు. ఎవరు ఏ సహాయం కావాలన్నా చేసేవాడు. అందువల్లనే అతనికి ఆ చుట్టుపట్ల గ్రామాలలో, పట్టణాలలో ఎంతో మంది స్నేహితులు ఉన్నారు. అయితే అతని ఔద్ధత్యం కారణంగా అతనికి ఎంతో మంది శత్రువులు కూడా తయారయ్యారు. వారి శత్రుత్వానికి అసూయ మరొక కారణం. అనేక విషయాలలో అతను అధిక ప్రజ్ఞావంతుడు కావడం, లక్షాధికారి కావడం, రాజకీయాలలో కూడా పైకి రావడంవంటివన్నీ వారి అసూయ పెచ్చుపెరగడానికి

దోహదం చేశాయి. అబ్కారీ కంట్రాక్టరుగా ఉంటూ ఎన్నడూ ఓ చుక్క అయినా ముట్టుకోకపోవడం, మంచి యౌవనంలో ఆరోగ్యంగా ఉండి చేతినిండా డబ్బు ఉండి కూడా శీలం ఏ మాత్రం చెడకపోవడం వంటివన్నీ వారి ఈర్ష్యానలంలో ఆజ్యంగా తయారయ్యాయి. జస్టిస్ పార్టీ మనిషిని ఇక్కడ ఓడించే బాధ్యత నీది అని అన్నంతనే అందుకు ఒప్పుకొని ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ బలపరిచిన పెద్ద జమీందారును చిత్తుగా ఓడించి- పార్టీ నిలబెట్టిన "బికారిని" బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించినప్పుడు ఊళ్లో ఉండే సామాన్యులే కాదు- పట్టణాలలో, నగరంలో ఉన్న పెద్దలే చకితులు అయ్యారు. కొందరు పెద్దలు లోలోపల కొంత అసూయపడ్డారు.

అప్పుడే కాదు- చంద్రమ్మను అతను వైభవంగా పెళ్లాడినప్పుడు కూడా వాళ్ళంతా ఎంతో అసూయపడ్డారు.

కూతురును, అల్లుడినీ కనిపెట్టుకొని ఉండడానికి రత్తమ్మ ఉన్నఊరు విడిచి అతని ఇంటికి మకాం మార్చింది ఐశ్వర్యం అబ్బిన కూతురిని చూచుకొని మురిసిపోయింది రత్తమ్మ.

కాని ఎన్నాళ్ళో సాగలేదు ఆ స్థితి.

అహింసాత్మకమైన పద్ధతిలో సహాయం నిరాకరించి ప్రభుత్వ యంత్రాంగాన్ని స్తంభింప చెయ్యవచ్చుననీ, ఫలితంగా దొరలు హడలిపోయి దేశం నుంచి పారిపోతారనీ నాయకులు చెప్పగా విన్నాడతను. అతనికి నమ్మకం కలిగింది.

ఉద్యమం ముమ్మరంగా సాగింది

ఆ ప్రాంతంలో అతను ఉద్యమ నాయకుడయ్యాడు. అతని ప్రోద్బలంతో ఎందరో ఉద్యమంలోకి వచ్చారు. పెద్ద ఎత్తున అరెస్టులు జరిగాయి. కొన్నాళ్ళదాకా అతన్ని అరెస్టు చెయ్యడానికి ఎవరూ

ముందుకు రాలేదు. అతను ఊళ్లో లేదనీ, పరారీ అయ్యాడనీ అధికారులు పూర్వంలాగే పైకి వ్రాశారు. కాని అతని విరోధులు కొందరు పనిగట్టుకొని ఈ విషయాలన్నీ బయటపెడుతూ పైకి లేఖలు వ్రాశారు. దాంతో పరిస్థితి క్షణాలమీద మారింది. అతన్ని వెంటనే అరెస్టు చెయ్యమని ముందు ఉత్తరువులు వచ్చాయి. ఆ మరునాడే నగరంనుంచి పెద్ద అధికారి వచ్చాడు. ఆ అధికారి ఏకాయెకి అతని ఇంటికి వెళ్ళి అతన్ని బయటకు పిలిపించి దొంగను తిట్టినట్టు తిట్టి చేతికి బేడీలు తగిలించబోయాడు అతను పారిపోతాడేమోనన్న భయంతో. అందుకు అతనికి పట్టరాని కోపం వచ్చింది. చేతిలో ఉన్న కర్రతో ఆ అధికారి నెత్తిపై ఒక్క దెబ్బ బలంగా కొట్టాడు. అతని తల పగిలింది. అతను పారిపోయాడు. ఇంటిబయట అధికారి ఆజ్ఞానుసారం వేచి ఉన్న పోలీసులు గావుకేక విని లోపలకు వచ్చి జరిగిన ప్రమాదం గుర్తించారు. వెంటనే అయన్ను ఆసుపత్రికి మోసుకొని పొయ్యారు. కాని ఆ అధికారి అక్కడే మరణించాడు. అతనికి ప్రభుత్వం అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించి వీరోచితంగా పోరాడి, "రాజుగారి కోసం" ప్రాణాలు అర్పించినందుకు బంగారు పతకం ఒకటి బహూకరించింది. పతకంతో పాటు అతని కుటుంబానికి కొంత నగదు కూడా ఇచ్చారు.

పది రోజుల తర్వాత అతను స్వస్థలానికి తిరిగి వచ్చాడు. ఊళ్లోకి రాకముందే అతని సన్నిహితులు అంతకు ముందు వచ్చిన అరెస్టు వారంటులు కాక కన్పిస్తే వెంటనే కాల్చి చంపమని ఉత్తరువులు వచ్చాయనీ, క్రొత్త అధికారులు ఎవరెవరో గ్రామానికి వచ్చి వెళుతున్నారనీ చెప్పివచ్చారు.

అప్పటి నుంచి అతను తన యింటికి ఎంతో రహస్యంగా అర్ధరాత్రి వేళ వచ్చి మళ్ళీ తెల్లవారకముందే వెళ్ళిపోవడం మొదలు

పెట్టాడు. ఒకసారి అతను అలా వెళ్ళిన గంటకు యాభైమంది సాయుధ రిజర్వు పోలీసులు తన యిల్లు చుట్టుముట్టారు. కొందరు లోపలకు వెళ్ళి సోదా చేశారు. రత్తమ్మనూ, చంద్రమ్మనూ ప్రశ్నలతో వేధించారు. అనేక విధాల భయపెట్టారు. అతని ఆచూకీ చెప్పమన్నారు. ఆమె ఎంతకూ చెప్పకపోతే చివరకు విసిగి ఆమెమీద లాఠీ ప్రయోగించారు. కాని లాభం లేకపోయింది. ఆ యిల్లంతా నానా ఆగంచేసి వెళ్లిపోయారు

దాంతో అతనికి భయం పట్టుకొన్నది.

చంద్రమ్మను తీసుకొని అతను దేశంమీదకు పరారి అయ్యాడు.

అతను భార్యను వెంటపెట్టుకొని పోలీసులనుంచి తప్పించుకొంటూ అనేక ప్రాంతాలకు వెళ్లాడు. అల్లా అతను వెళ్ళని ఊరులేదు. ఏ ఊరు వెళ్ళినా ఎంతో రహస్యంగా రైల్లోనుంచి దిగి టాక్సీలో సరాసరి ఏ హోటలుకో వెళ్లడం, అక్కడ నుంచి మళ్ళీ అంతలో ప్రయాణమై మరో చోటుకు మారడం పరిపాటి అయ్యింది. ఎప్పుడు ఎక్కడకు వెళ్ళినా, ఏమి చేస్తున్నా తన్ను పట్టుకోడానికి ఎవరైనా వస్తున్నారేమోనని ఎక్కడైనా పొంచి ఉన్నారేమోనని భయపడుతూ చూచేవాడు. ఇది గమనించి చంద్రమ్మ మొదట్లో ఎంతో భయపడి పోయింది. అతను బయట ఎవరితో ఎలా ఉన్నా ఆమెతో ఎంతో శాంతంగా, ఎంతో సౌమ్యంగా, ప్రేమగా మాటాడేవాడు. అందువల్లనే అతన్ని గురించి అక్కడా అక్కడా వింటున్నవన్నీ కేవలం కట్టుకథలేమో అనుకొని భయం పోగొట్టుకొన్నది చంద్రమ్మ. పైగా ఎక్కడికి వెళ్ళినా అతను ఒక యువ జమీందారనీ, తను జమీందారిణి అనీ అందరూ అనుకోవడం గమనించి ఆమె ధైర్యం తెచ్చుకొన్నది. అదీకాక ఉన్నట్టుఉండి అతని స్వభావం మారిపొయ్యేది. అప్పటిదాకా అంత భయపడుతున్నవాడల్లా చప్పున పట్టపగలు భార్యను వెంట పెట్టుకొని నగరంలో ఏ బట్టల

దుకాణానికో వెళ్ళేవాడు. అతనికి ఏ పిచ్చిపడితే ఆ పిచ్చి. కొనడం మొదలుపెడితే ఏదిపడితే అదే కొనడం. తిరగడం మొదలుపెడితే అన్నీ తిరగడం. మాటాడడం మొదలుపెడితే అదే పనిగా మాటాడడం.

నాలుగు నెలలు గడిచేసరికి ఆమె పరిస్థితికి అలవాటుపడ్డది అతని ద్వారా అనేక విషయాలు తెలుసుకొన్నది. భర్త ఆజ్ఞానుసారం ఆమె నిర్భయంగా ఎన్ని కుటుంబాలనో పరామర్శించి వచ్చేది. ఆయా కుటుంబాలకు ఎంతో ధన సహాయం చేసింది. అతను ఎందుకీ సాయం చేస్తున్నాడో క్రమంగా తెలుసుకొన్నది. భర్త ద్వారానూ, ఆయన మిత్రుల ద్వారానూ, దేశ పరిస్థితులలో వస్తున్న మార్పులను గురించీ, ఉద్యమాలను గురించీ కొంత అవగాహన చేసుకొన్నది.

భర్త అలా ఎందుకు పారిపోతున్నదీ కూడా అర్థం చేసుకొన్నది.

అతనిపట్ల సానుభూతి కలిగింది. జాలి కలిగింది.

మరికొన్ని నెలలు గడిచేసరికి పరిస్థితి విషమించింది. అతను ఎక్కడికి వెళ్ళితే అక్కడ ప్రభుత్వం వల వన్ని ఉంచిందనీ ఎటు తిరిగితే అటు తుపాకులు తనవైపుకు గురిపెట్టి ఉంచారనీ గ్రహించాడు. ఆ విషయం భార్యతో చెప్పి ఇంక తన్ను విడచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళి తలదాచుకోమన్నాడు. ఆమె అందుకు ఒప్పుకోలేదు. "నిన్ను వెంటపెట్టుకొని తప్పుకు తిరగడం సులభమైన పనికాదు. ఇందువల్ల నాకే కాక నీకు కూడా ప్రమాదం. విడిగా ఒంటరిగా నువ్వు కన్పించినా నీకు ప్రాణాపాయం ఉండదు అయూకీ చెప్పమని బాధించవచ్చు అంతగా తప్పనిసరి అయితే తెలిసినదిచెప్పి ప్రాణం కాపాడుకో" అంటూ ఎన్నో విధాల ఆమెను ఒప్పించడానికి ప్రయత్నించాడు. కాని ఆమె అతన్ని విడిచి వెళ్ళడానికి సిద్ధపడలేదు.

అతను ఆమెను వెంటపెట్టుకొని దేశం మారు మూల ప్రాంతాలకు వెళ్ళాడు. క్రొత్త క్రొత్త ప్రదేశాలకు వెళ్లాడు. మళ్లా అంతకు ముందు వెళ్లిన చోటకే వెళ్లాడు ఎంత మందినో ఆశ్రియం ఇమ్మనికోరాడు. ఆశ్రియం భద్రతకోసం ఎంతో ఖర్చు పెట్టాడు. ప్రయోజనం లేకపోయింది. అతనికి ధైర్యం పూర్తిగాపోయింది. భయం అతన్ని కృంగ తీసింది.

అనుక్షణం అతను వణకడం మొదలు పెట్టాడు. ఆరోగ్యం క్రిమంగా క్షీణించడం గమనించి చంద్రిమ్మ దిగులుపడ్డది. అతనికి చెప్పకుండా సంస్థ తాలూకు పెద్దలతో సంప్రదించింది. వారొక సలహా చెప్పారు. అది అమెకు అన్నివిధాలా నచ్చింది. ఆ సలహా భర్తకు చెప్పింది అంతకు తప్ప మరో గత్యంతరంలేదని ఇద్దరికీ నమ్మకం కలిగింది. అక్కడ వారికి తప్పక ఆశ్రియం లభిస్తుందని కొంతంత ఆశతో ఇద్దరూ ఒక నిశ్చయానికి వచ్చారు. వెనుక ఉండి ఉద్యమాన్ని నడిపిస్తున్న నాయకుని ఆశ్రిమానికి చేరుకున్నారు.

ఇద్దరూ వెళ్ళి ఆయన పాదాలమీద పడ్డారు. అతను తన చరిత్రి అంతా చెప్పి క్షమాభిక్షకోరాడు. తనకు కాకపోయినా భార్యకైనా శరణు యిమ్మని ప్రాధేయ పడ్డాడు. ఆయన చాలా సేపుదాకా ఏమీ మాటాడక పొయ్యేసరికి అతను బెంబేలు పడిపొయ్యాడు. మళ్ళీ ఆయన కాళ్ళమీద పడి తన భార్యకు రక్షణ ఇస్తానంటే ఏమి చెయ్యమంటే అది చేస్తానని వాగ్దానంచేశాడు. ఎల్లా అయినా సరే ఆమెను కాపాడక తప్పదనీ అలా మాట ఇచ్చేదాకా పాదాలు విడవనన్నాడు. ఆయన అతన్ని నెమ్మదిగా లేవదీసి భయపడ వద్దనీ పిరికి పందలకు ఉద్యమంలో తావులేదనీ ఏ పరిస్థితులలోనూ ఎవరూ హింసాత్మక చర్యలకు దిగడానికి వీలులేదనీ చెప్పారు. అతన్ని వెళ్ళి ధైర్యంగా ప్రభుత్వానికి స్వయంగా పట్టుపడి పొమ్మనీ, దాని తర్వాత తనూ తన సహచరులూ కలసి కృషిచేసి

అవకాశం ఉంటే ప్రభుత్వం నుంచి క్షమాభిక్ష సంపాదించడానికి ప్రయత్నిస్తామనీ సలహాఇచ్చారు. అలా చేస్తే చంద్రమ్మకే కాక తన సంస్థకు సరియైన రక్షణ లభిస్తుందని అన్నారాయన. తమ ఉద్యమం కేవలం అహింసాత్మక మైనదని ఋజువుచెయ్యడానికి అదొక్కటే మార్గమని కూడా ఆయన ఉద్బోధించారు.

అతను మార్గాంతరాలు సూచించాడు. వాటికి ఆయన ఆమోదం లభించలేదు.

చివరకు అతను ఆయన మాటప్రకారం చెయ్యడానికి సిద్ధపడ్డాడు.

ఆ ముసలాయన ఆ విషయం తంతి ద్వారా సమీపం లోని నగరంలో పోలీసు స్టేషనుకు తెలియచేశారు.

బండ్ల కోటయ్య నిర్భయంగా అక్కడకువెళ్ళి తను ఖలానా అనీ స్వయంగా తను పట్టుబడి పోవడానికి వచ్చాననీ చెప్పాడు అలా చెబుతూ అతను క్షణంలో ఎన్నో ఆశలు కల్పించుకొన్నాడు. కాని అతను చెప్పడం పూర్తికాకముందే అక్కడ ఉన్న పోలీసు ఇనస్పెక్టరు అతనిపై తుపాకి గురిపెట్టి కాల్చాడు. అతను విరిగిన కొండ కొమ్ములా నేలకూలినా ఆ ఇనస్పెక్టరు ఇంకా కాలుస్తూనే ఉన్నాడు ఒక వంక నిలువునా ఒణికి పోతూనే.

* * *

ఆశ్రమంలో చంద్రమ్మ దుఃఖ సముద్రంలో మునిగిపోయింది. ఆయన ఆమెను ఓదార్చడానికి ఎంతో ప్రయత్నించారు. తన మూలంగా ఒక నిండు ప్రాణం బలిఅయిపోయినందుకు ఆయన చాలా బాధపడ్డాడు. అతను మహా వీరుడులా తన సలహామీద అక్కడకువెళ్ళి అలా ఆత్మ బలిదానం చేసినందుకు ఆయన ఎంతో గర్వపడ్డాడు. అతనికి తను ఋణపడ్డానని అనుకొన్నాడు.

ఆయన రెండు రోజులు ఉపవాసం చేశారు.

చంద్రమ్మను దగ్గరకు తీసుకొని ఆమెకు దుఃఖం పోగొట్టడానికి ప్రయత్నించారు. ఎన్నో ఉపాయాలు చెప్పారాయన. సిద్ధాంతాలు ప్రబోధించారు.

క్రమంగా చంద్రమ్మ మారింది.

ఆయన ఆమె చేతికి రాట్నం ఇచ్చి నూలు వడకమన్నారు.

ఆమె తన పట్టుబట్టలన్నీ కుప్పవేసి నిప్పు అంటించింది నగలన్నీ తీసి దానం చేసింది. మునలాయనను ఇతర కార్యకర్తలతోపాటు కనిపెట్టుకొని ఉంటూ ఆయనకు సేవచేస్తూ రాట్నంపై నూలువడుకుతూ రోజులు గడిపింది.

ఆమెకదే బ్రతుకు తెరువు అయ్యింది గతం మరచి, భవిష్యత్తుపై ఆశలు పెంచుకొని, నిశ్చింతగా కాలం గడపడానికి ఆమెకు అది ఒక్కటే మార్గం అయ్యింది. భర్తపేరు చిరస్థాయిగా ఉండేందుకు కృషి చెయ్యాలని ఆమె గట్టిగా నిశ్చయించుకొన్నది.